
www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 15 మార్చి 2024
5
తిరుపతి




నాయుడుపేటలో భూకంపం

ప్రజాశక్తి నాయుడుపేట

నాయుడుపేట పట్టణంలో గురువారం రాత్రి 8 గంటల 45 నిమిషాల సమయంలో సుమారుగా ఐదు సెకండ్ల పాటు భూమి కంపించింది. ఈ సంఘటనతో ఏం జరుగుతుందో అర్థం కాక భయభ్రాంతులకు గురైన ప్రజలు ఇళ్లలోంచి బయటకు పరుగులు తీశారు. బలమైన భూకంపం సంభవించినట్లు రిక్టర్ స్కేల్ పై భూకంప తీవ్రత 4.8 గా నమోదైనట్లు జాతీయ భూకంప కేంద్రం నిర్ధారించింది. నాయుడుపేటలోనే గాక సూళ్లూరుపేట నియోజకవర్గంలోని దొరవారిసత్రం, సూళ్లూరుపేట చుట్టుపక్కల ప్రాంతాల్లో భూకంపం సంభవించినట్లు తెలిపారు.

తిరుపతిలో నాన్ 'లోకల్' వార్..!



'ఆరణి గో బ్యాక్' అంటూ బ్యానర్లు
శ్రీకాళహస్తి, చంద్రగిరిలో వీడిన టెన్షన్
అసెంబ్లీ స్థానం స్థానికులకే ఇవ్వాలి
వెంకటగిరిలో 'కురుగొండ్ల'కే సీటు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

తిరుపతి అసెంబ్లీ టికెట్‌ను జనసేనతో పొత్తులో భాగంగా ఆ పార్టీకి కేటాయించారు. అయితే మొదటినుంచి పార్టీ కోసం కష్టపడిన వారిని పక్కన పెట్టి, జనసేనలోకి వలసొచ్చిన చిత్తూరు వైసిపి సిట్టింగ్ ఎంఎల్‌ఎ ఆరణి శ్రీనివాసులును ప్రకటించడంతో ఆ పార్టీలో కలకలం మొదలయ్యింది. తిరుపతి అసెంబ్లీ సీటు అధినేత పవన్‌కల్యాణ్ బరిలోకి దిగుతారని తొలినుంచి ప్రచారం జరిగింది. ఒకవేళ పవన్‌కల్యాణ్ పోటీ చేయకపోతే జనసేన నుంచి డాక్టర్ హరిప్రసాద్, కిరణ్‌రాయల్‌కు టిక్కెట్ వస్తుందనుకున్నారు. ఇంతలోనే టిడిపి మాజీ ఎంఎల్‌ఎ ఎం.సుగుణమ్మ జనసేనలోకి వెళ్లయినా టిక్కెట్ తెచ్చుకోవాలని చివరి వరకూ ప్రయత్నిస్తూనే ఉన్నారు.. అయితే పిల్లిపోరు పిల్లిపోరు ఎలుక తీర్చిందని చిత్తూరు నుంచి వలసొచ్చిన ఆరణి శ్రీనివాసులుకు తిరుపతి సీటును ప్రకటించడంతో 'స్థానిక' టిడిపి, జనసేన నేతలు గుర్రుమంటున్నారు.

తిరుపతిలోని ఓ హోటల్లో గురువారం సమావేశమయ్యారు. మరోసారి శుక్రవారం కూడా సమావేశమై అధినేత పవన్‌కల్యాణ్ దృష్టికి తమ అభిప్రాయాన్ని తీసుకెళ్లాలని వారు మూకుమ్మడిగా నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. 'ఆరణి గోబ్యాక్' అంటూ తిరుపతి నగర వీధుల్లో బ్యానర్లు సైతం వెలిసాయి. పెద్దిరెడ్డి, భూమన కరుణాకర్‌రెడ్డి కోవర్ట్‌గా ఉన్న ఆరణి శ్రీనివాసులు పార్టీ మారగానే అభ్యర్థిగా ఎలా ప్రకటిస్తారన్నది వారి వాదన. తిరుపతి పరిస్థితి ఇలా ఉండగా శ్రీకాళహస్తి, చంద్రగిరిలో టెన్షన్ వీడింది. శ్రీకాళహస్తిలో బొజ్జల సుధీర్‌ను, చంద్రగిరిలో పులివర్తి నానినే అభ్యర్థులుగా ప్రకటించారు. ఇక వెంకటగిరిలోనూ కురుగొండ్ల లక్ష్మీప్రియకే టిక్కెట్ దక్కింది. ఏదిఏమైనా టిడిపి ప్రకటించిన రెండో జాబితాలో ప్రధాన ఆధ్యాత్మిక నగరమైన తిరుపతిలో 'నాన్ లోకల్' అంశాన్ని స్థానిక నేతలు జీర్ణించుకోలేకపోవడం కనిపించింది. సత్యవేడులో తాజా సిట్టింగ్ ఎంఎల్‌ఎ ఆదిమూలం దక్కించుకున్నారు.

గురువారం టిడిపి, జనసేన నేతలు ఊకా విజయ్‌కుమార్, ఆర్‌సి మునిక్రిష్ణ, జేబీ శ్రీనివాస్, దంపూరి భాస్కర్ యాదవ్, పులిగోరు మురళీక్రిష్ణారెడ్డి, ఆనంద్ యాదవ్, పుష్పావతి, బాబ్జీ, జనసేన నుంచి డాక్టర్ హరిప్రసాద్, కిరణ్ రాయల్, రాజారెడ్డి హాజరయ్యారు. తిరురపతి అసెంబ్లీకి పోటీ చేస్తే జనసేన నుంచి పవన్ కల్యాన్ పోటీ చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే స్థానికులకు ఇవ్వాలని పట్టుబట్టారు. స్థానికులకు ఇవ్వకుండా ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారికి టిక్కెట్ ఎలా ఇస్తారని ప్రశ్నిస్తున్నారు. వైసిపి ఐదేళ్ల పాలనలో ఎన్నో పోరాటాలు చేశామని, జైలుకెళ్లి కేసులు పెట్టించుకున్నామని, చిత్తూరు వైసిపి తాజా ఎంఎల్‌ఎ ఆరణి శ్రీనివాస్ ఆ పార్టీకి రాజీనామా చేసి జనసేనలో చేరిన వెంటనే తిరుపతి టిక్కెట్ ఎలా ఇస్తారని ప్రశ్నిస్తున్నారు. తమ సహకారం లేనిదే ఎలా పోటీ చేస్తారని మండిపడుతున్నారు. జనసేన అధినేత పవన్‌కల్యాణ్, టిడిపి అధినేత నారా చంద్రబాబునాయుడు తిరుపతి ఎంఎల్‌ఎ టిక్కెట్ విషయంలో పునరాలోచించాలని, లేదంటే కార్యకర్తలు మనోధైర్యం కోల్పోయే అవకాశం ఉందన్నది వారి వాదన. తిరుపతిలో వైసిపి ఎంఎల్‌ఎ అభ్యర్థి భూమన అభినయ్‌రెడ్డి ఎన్నో అక్రమాలకు పాల్పడ్డారని, మాస్టర్‌ప్లాన్ రోడ్ల పేరుతో వేలాదిమంది భూములు కోల్పోయి నష్టపరిహారం చెల్లించకుండా ఇబ్బందులకు గురిచేస్తే టిడిపి, జనసేన పెద్దఎత్తున పోరాడిందని గుర్తు చేశారు. ఆరణి శ్రీనివాసులుకే టిక్కెట్ ఇస్తే తాము పనిచేసేది లేదని కొంతమంది పేర్కొన్నట్లు తెలుస్తోంది. పార్టీని ఐదేళ్ల పాటు నమ్ముకుని ఎంతో నష్టపోయామన్నది వారి వాదన. శుక్రవారం పవన్‌కల్యాణ్‌ను, చంద్రబాబును కలవనున్నారు. నాన్ లోకల్‌కు టిక్కెట్ ఇవ్వొద్దని గట్టిగా కోరనున్నట్లు తెలుస్తోంది. ఇంతమంది 'స్థానికులు' ఉండగా వలసొచ్చిన వారికి ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఏంటన్నది వారి భావన. శుక్రవారం రామతులసి కల్యాణ మండపంలో మరోసారి సమావేశమై ఏకగ్రీవ తీర్మానం చేసి పార్టీ హైకమాండ్‌కు నివేదించనున్నారు. అయితే 2009లో పిఆర్‌పి తరపున చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పిఆర్‌పి అభ్యర్థిటీ పోటీచేసి రెండో స్థానంలో నిలిచారు. టిడిపి అభ్యర్థి మూడో స్థానానికి పరిమితం అయ్యారు. తిరుపతి పద్మావతిపురంలో సొంత ఇల్లు ఉండి, బంధుగణం ఉంటే పోటీచేయడానికి ఎలా అనర్హుడవుతాడన్నది అధినేతల వాదనగా వినిపిస్తోంది.

అధిష్టానం ఆదేశిస్తే పోటీ చేస్తా : ఆరణి శ్రీనివాసులు

అధిష్టానం ఆదేశిస్తే తిరుపతి ఎంఎల్‌ఎ అభ్యర్థిగా పోటీ చేస్తానని ఆరణి శ్రీనివాసులు 'ప్రజాశక్తి'కి తెలిపారు. తిరుపతి ఎంఎల్‌ఎ అభ్యర్థి లోకల్, నాన్ లోకల్ అనే చర్చ జరుగుతుందన్న విషయం తనకు తెలియదన్నారు. అధిష్టానం ఆదేశాలను పాటించడమే తన కర్తవ్యమని చెప్పారు.



బాధ్యతను పెంచింది : బొజ్జల సుధీర్, శ్రీకాళహస్తి

శ్రీకాళహస్తిలో బొజ్జల సుధీర్‌కు ప్రకటించడంతో కార్యకర్తలు ర్యాలీగా వచ్చి ఎన్టీఆర్ విగ్రహానికి నివాళి అర్పించారు. కుటుంబంతో కలిసి బొజ్జల సుధీర్‌రెడ్డి ముక్కంటిని దర్శించుకున్నారు. తనకు టిక్కెట్ రావడం మరింత బాధ్యతను పెంచిందని, కూటమిలో భాగమైన జనసేన, బిజెపి నాయకులను సమన్వయ పరచుకుని గెలుపు సాధించుకుంటామని తెలిపారు.



గల్లా అరుణను కలిసిన పులివర్తి నాని

చంద్రగిరి నియోజకవర్గ అభ్యర్థిగా పులివర్తి నాని(వెంకట మణిప్రసాద్) ని ప్రకటించడంతో కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు. నారావారిపల్లి వరకూ భారీ మోటర్ సైకిల్ ర్యాలీ నిర్వహించి నాగలామ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎన్టీఆర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. మాజీ మంత్రి గల్లా అరుణకుమారి నివాసానికి వెళ్లి ఆమెకు దుశ్శాలువా కప్పి ఆమె ఆశిస్సులు తీసుకున్నారు. రామచంద్రాపురంలో జనార్దన్ చౌదరి, తిరుమలరెడ్డి, గిరి, కోర హరిప్రసాద్, సి.రవి, ధనంజయరెడ్డి, కె.నరసింహారెడ్డి, రామిరెడ్డి తదితరులు బాణసంచా పేల్చి సంబరాలు నిర్వహించారు.



వెంకటగిరిలో కురుగొండ్ల లక్ష్మీ ప్రియ

తిరుపతి జిల్లా వెంకటగిరి నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా లక్ష్మి ప్రియను ప్రకటించారు.ఎట్టకేలకు కురుగొండ్ల కుటుంబానికి దక్కింది. గురువారం లక్ష్మీ ప్రియ వెంకటగిరి గ్రామశక్తి శ్రీ శ్రీ పోలేరమ్మ అమ్మవారికి పూజలు నిర్వహించి దర్శించుకున్నారు. నియోజకవర్గ అభివద్ధికి గతంలో కురుగుల రామకష్ణ ఎంతో కషి చేశారని, ఆయన అడుగుజాడల్లో ప్రజల సమస్యలు పరిష్కరించడానికి నియోజకవర్గ అభివద్ధికి శక్తివంచన లేకుండా కషి చేస్తానని తెలిపారు.



కార్మికులపై 'ఆక్సోరా' ఉక్కుపాదం

వేతనాలు చెల్లించకుండా కాలయాపన
నిరసన తెలిపితే తొలగిస్తామంటూ బెదిరింపులు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి రెవెన్యూ డివిజన్ తొట్టంబేడు మండలం రౌతు సూరమాల గ్రామ సమీపంలో ఉన్న ఆక్సోరా రిసోర్స్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమ కార్మికులపై వేధింపులకు పాల్పడుతోంది. యాజమాన్యం అరాచకాలు నానాటికీ మితిమీరిపోతున్నాయి. కార్మికులను కట్టుబానిసల కన్నా హీనంగా చూస్తున్న పరిస్థితి నెలకొంది. ఆ కంపెనీ నుంచి బయటపడి వేరొక కంపెనీలో ఉపాధి పొందుదామన్నా వెళ్ళనీయని దుస్థితి. గొడ్డులా చాకిరి చేస్తేనే బకాయిలు చెల్లిస్తాం.. లేదంటే ఇక్కడే మీరు పస్తులతో మగ్గాల్సిందే అంటూ ఆక్సోరా యాజమాన్యం కార్మికులపై బెదిరింపులకు పాల్పడుతుండడం విచారకరం. ఒకవేళ మీరు నిరసన తెలిపినా.. ఉపాధి కోసం వేరొక పరిశ్రమకు వెళ్లినా ఒప్పందం ప్రకారం మీపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామంటూ యాజమాన్యం నిరంకుశంగా వ్యవహరిస్తున్న పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో ఆక్సోరా కార్మికులు తమకు న్యాయం చేయాలనీ, ఆక్సోరా యాజమాన్యం వేధింపుల నుంచి రక్షించాలంటూ ఉన్నతాధికారులను వేడుకుంటున్నారు. అయినా ఉన్నతాధికారుల నుంచి స్పందన కరువవడంతో ఎవరికి చెప్పుకోవాలో తెలియక కన్నీరు మున్నీరవుతున్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మిక చట్టాలను నీరు గార్చడంతోనే పరిశ్రమల యాజమాన్యాలు కార్మికుల పట్ల ఉక్కు పాదం మోపగలుగుతున్నాయనే విమర్శలు వస్తున్నాయి.

తొట్టంబేడు మండలంలోని రౌతు సూరమాల గ్రామ సమీపంలో 2016లో ఆక్సోరా మెటల్ అండ్ లెడ్ కంపెనీని నెలకొల్పారు. ఈ పరిశ్రమలో సుమారు 90 మంది కార్మికులు గత కొన్ని సంవత్సరాలుగా పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరిలో స్థానికులతో పాటు స్థానికేతరులూ ఉన్నారు. అయితే కొన్ని సంవత్సరాలుగా ఆక్సోరా కార్మికుల వద్ద శ్రమ దోపిడీకి పాల్పడుతోందన్న విమర్శలు వస్తున్నాయి. అంతేకాకుండా కార్మికులకు చెల్లించాల్సిన వేతనాలు, పీఎఫ్ లు సకాలంలో చెల్లించడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. పదిమంది చేయాల్సిన పనిని ముగ్గురు, నలుగురితో చేయిస్తూ కార్మికుల చేత గుడ్డు చాకిరి చేయించుకుంటున్నారని విమర్శలు వచ్చాయి. దీంతో విసిగి వేసారిన కార్మికులు తమకు రావాల్సిన వేతన బకాయిలు, పీఎఫ్ లు వెంటనే చెల్లించాలనీ, లేకుంటే విధులను బహిష్కరిస్తామని కార్మికులు నోటీసులు ఇచ్చారు. కార్మికులకు మూడు నెలల వేతనాలు యాజమాన్యం చెల్లించకపోవడంతో కుటుంబాలను పోషించుకోలేని పరిస్థితి ఏర్పడింది. కార్మికుల నుంచి నిరసన నోటీసు అందుకున్న పరిశ్రమ అధినేత విజయేంద్ర కేడియా బకాయి ఉన్న రెండు నెలల 8 రోజుల జీతం ఇవ్వకపోగా, పని చేయండి.. పని చేస్తే నే జీతం, లేకుంటే కేసులు పెడతామంటూ బెదిరింపులకు దిగిన పరిస్థితి ఏర్పడింది. అంతటితో ఆగకుండా కార్మికులను మధ్యాహ్నం వరకు ఎండలోనే నిలబెట్టి వారికి కనీసం తాగునీరు కూడా అందించకుండా ఇబ్బందులు పెట్టినట్లు సమాచారం. ఎండ తీవ్రతకు వడదెబ్బ సోకి ఇద్దరు కార్మికులు అస్వస్థతకు గురైనా వారిని కనీసం ఆస్పత్రికి కూడా తీసుకెళ్లలేదని తెలుస్తోంది. మధ్యాహ్నం పైబడి క్యాంటీన్ కి వెళితే అక్కడ భోజనం పెట్టొద్దంటూ నిర్వాహకులకు హుకుం జారీ చేసినట్లు సమాచారం. అక్కడితో ఆగకుండా కార్మికులు నివాసాలు ఉంటున్న అద్దింటి నిర్వాహకులకు ఫోన్ చేసి వాళ్లను వెంటనే ఖాళీ చేయించాల్సిందిగా ఒత్తిడి తెచ్చిన విచిత్ర పరిస్థితి.

అంతేకాకుండా పరిశ్రమ కేంద్ర కార్యాలయం నుంచి న్యాయవాదులతో కార్మికులకు ఫోన్ చేసి మీరు నిరసన తెలిపితే, కంపెనీ నిబంధనలు ఉల్లంఘిస్తే ఎలాంటి చట్టపరమైన చర్యలు తీసుకుంటామో, వివరించి వారిని భయభ్రాంతులకు గురి చేసినట్లు సమాచారం. దీంతో ఆక్సోర వేధింపులకు తాళలేక ఇతర పరిశ్రమలకు ఉపాధి కోసం వెళ్లిన కార్మికులకు ఉద్యోగాలు రాకుండా, ఆయా పరిశ్రమల యాజమాన్యాలకు ఫోన్ చేసి కార్మికుల గురించి చెడుగా చెప్పి వారికి అక్కడ కూడా భతి లేకుండా చేశారని కార్మికులు ఆరోపిస్తున్నారు. పెండింగ్ వేతనాలు,,పీఎఫ్ అడిగితే ఏమైనా చేసుకోండి ఒక రూపాయి కూడా ఇవ్వనని, తనకు ఇన్సూరెన్స్ ఉందని, తాను క్లైమ్ చేసుకుంటా అంటూ క్రూరంగా వ్యవహరిస్తున్నారని కార్మికులు కన్నీరు మున్నీరవుతున్నారు. జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ స్పందించి తమకు ఇకనైనా న్యాయం చేయాలని కోరుతున్నారు.



కార్మికుల నిరసన దీక్ష

ఘనంగా అంతర్జాతీయ గణిత దినోత్సవం

ప్రజాశక్తి-పాకాల, క్యాంపస్

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల గణిత విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించినట్లు కళాశాల ప్రధానాచార్యులు డాక్టర్ మొహిద్దీన్ భాష తెలిపారు. విద్యార్థులు గణిత శాస్త్రం పట్ల ఆసక్తిని పెంపొందించుకుంటే ఏ రంగంలోనైనా రాణించవచ్చని అన్నారు. గణిత శాస్త్ర అధ్యాపకులు మాధవి మాట్లాడుతూ గణిత శాస్త్ర ప్రాముఖ్యతను, పోటీ పరీక్షలలో నెగ్గడానికి గణిత శాస్త్ర ఆవశ్యకతను విద్యార్థులకు వివరించారు. విద్యార్థులకు వకృత్వ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

మహిళా వర్సిటీలో... శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం లోని గణిత విభాగంలో " పై " దినోత్స వాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్వీయూ గణిత శాస్త్ర విభాగం ప్రొఫెసర్ వి.సుగుణమ్మ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిఐ డే ప్రాముఖ్యతను, విశిష్టతను వివరించారు. గణిత రంగంలో వివిధ గణిత శాస్త్రజ్ఞుల జీవిత సహకారాల గురించి ఆమె క్లుప్తంగా చర్చించారు. సమాజంలోని నిజ జీవిత సమస్యలను మోడల్‌గా చేయడంలో గణితాన్ని వర్తింపజేయాలని, మానవాళి సంతోషకరమైన జీవితాన్ని గడపడానికి సహాయపడాలని ఆమె విద్యార్థులను ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో విభాగాధిపతి డా.సి.వెంకటలక్ష్మి, సహాయ ఆచార్యులు డా.ఎం.శివ పార్వతి, అధ్యాపకులు డా.బి.విశాలి, డా.కె.మంజుల, డా.పి.డి.సెల్వి, డా.ఎ.శోభ, విద్యార్థులు పాల్గొన్నారు.



ఇంటర్ పరీక్షకు 987మంది గైర్హాజర్

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

గురువారం జిల్లాలో జరిగిన ఇంటర్ పరీక్షలకు 987 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఆర్ ఐ ఓ ప్రభాకర్ రెడ్డి తెలిపారు. జిల్లా వ్యాప్తంగా గురువారం 87 సెంటర్ల ద్వారా జరిగిన పరీక్షలకు 33,193 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 32,206 మంది విద్యార్థులు హాజరయ్యారు. జనరల్ కోర్సులో 805 మంది గైర్హాజరయ్యారు. జిల్లా వ్యాప్తంగా 14 కేంద్రాల ద్వారా జరిగిన ఒకేషనల్ కోర్సులకు 1307 మంది విద్యార్థులకు గాను 1025 మంది హాజరయ్యారు. 182 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు వెల్లడించారు.

రైతాంగ కార్మిక వ్యతిరేకి నరేంద్రమోడీ

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

ఢిల్లీలో రామ్‌లీలా మైదానంలో రైతులు చేస్తున్న పోరాటం జయప్రదం చేయాలని డిమాండ్ చేస్తూ జిల్లావ్యాప్తంగా సిఐటియు, రైతుసంఘాల సంయుక్త ఆధ్వర్యంలో నిరసన గళం వినిపించారు. తిరుపతి పాత మున్సిపల్ కార్యాలయం నుంచి నాలుగు కాళ్ల మండపం వరకూ సిఐటియు, ఎఐటియుసి, ఐఎఫ్‌టియు, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో రైతుల పోరాటాన్ని సంఘీభావంగా ప్రదర్శన నిర్వహించారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి మాట్లాడుతూ దేశం టెక్నాలజీ పరంగా ఎంత అభివృద్ధి చెందినా, సగటు మనిషి అన్నం తినే జీవించాలి తప్ప కంప్యూటర్లు కూడు పెట్టవన్నారు. వరిని, గోదుమలను పండిస్తున్నర ఐతుల సమస్యలు పరిష్కారం చేయాలని, లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. మూడు నల్ల చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కనీస గిట్టుబాటు ధర కల్పిస్తామని, ఎరువుల, విత్తనాల సబ్సిడీ ఇస్తామని వాగ్దానం చేసిన మోడీ ప్రభుత్వం మాట తప్పారన్నారు. 2024, జనవరి 26న రైతులందరూ మోడీ చెప్పిన వాగ్దానాన్ని అమలు చేయాలని ఆరునెలలకు సరిపడా ఆహార ధాన్యాలను వెంట తీసుకని చలో ఢిల్లీ కార్యక్రమానికి పిలుపునిచ్చారన్నారు. ఈ పోరాటంలో శుభకరన్సింగ్ బలయ్యారన్నారు. నాయకులు చిన్నం పెంచలయ్య, పి. హేమలత మాట్లాడుతూ రాబోయే రోజుల్లో దేశంలో ప్రజలు ఏమీ కొని తినలేని పరిస్థితి నెలకొంటుందన్నారు. కె.వేణుగోపాల్, టి.సుబ్రమణ్యం, ఎం.మాధవ్‌కృష్ణ, సాయిలక్ష్మి, చిన్నా, రాధాక్రిష్ణ, రమేష్, జయంతి, ఎండి రవి, కెవై రాజా, గోవిందస్వామి, కుడుము విజయ్‌కుమార్, రామిశెట్టి వెంకయ్య పాల్గొన్నారు.



గూడూరు టౌన్‌లో పాత బస్టాండ్ సెంటర్ వద్ద ధర్నా నిర్వహించారు. సిపిఎం నాయకులు జోగి శివకుమార్, బివి రమణయ్య, సురేష్, ప్రసాద్ పాల్గొన్నారు. పుత్తూరు టౌన్‌లో సిఐటియు జిల్లా కార్యదర్శి ఆర్.వెంకటేష్ ఆధ్వర్యంలో వ్యవసాయ నల్లచట్టాలను రద్దు చేయాలని నిరసన తెలిపారు. కెఆర్ సుబ్రమణ్యం పిళ్లై, ఎ.విజయ్, ఎ.శివ పాల్గొన్నారు. రేణిగుంట తారకరామనగర్ రెడ్‌క్రాస్ వద్ద సిఐటియు ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు జి.బాలసుబ్రమణ్యం, నాయకులు కె.హరినాథ్, ఇంటి స్థలాల సాధన పోరాట కమిటి అధ్యక్షులు పి.రాజశేఖర్, మస్తాన్, సుధ, పవిత్ర పాల్గొన్నారు.


మార్క్స్ సిద్ధాంతాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్, యంత్రాంగం

దోపిడీ లేని సమాజ నిర్మాణానికి మార్క్సిజమే ఆయుధమని, ఈ సిద్ధాంతాన్ని ప్రజల్లోకి విస్తారంగా తీసుకెళ్లాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు అన్నారు. మార్క్స్ 141వ వర్ధంతి పురస్కరించుకుని తిరుపతి యశోదానగర్‌లో నివాళి అర్పించారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్పొరేట్లకు ఊడిగం చేస్తూ, ప్రజలను దోచుకుంటోందని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో మతోన్మాద బిజెపిని ఓడించడమే లక్ష్యంగా సిపిఎం శ్రేణులు విస్తారంగా ప్రచారం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కందారపు మురళి, టి.సుబ్రమణ్యం, కె.వేణుగోపాల్ పాల్గొన్నారు.

గూడూరు టౌన్‌లో... సిపిఎం కార్యాలయంలో మార్క్స్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ప్రపంచ గమనాన్ని మార్చిన కారల్ మార్క్స్ సిద్ధాంతంపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. సిపిఎం నాయకులు జోగి శివకుమార్, బివి రమణయ్య, సురేష్, టి.వెంకట రామిరెడ్డి, బి.చంద్రయ్య, అడపాల ప్రసాద్ పాల్గొన్నారు.

నాయుడుపేటలో... వేదనపర్తి సుందర రామిరెడ్డి భవన్ సిఐటియు కార్యాలయంలో నాయకులు శివకవి ముకుంద ఆధ్వర్యంలో నివాళి అర్పించారు. మానవ చరిత్ర మలుపుల గుట్టు విప్పిన మహోన్నతుడు కారల్‌మార్క్స్ అని అన్నారు. మానవశ్రమే అన్నింటికీ మూలమని, మానవత్వాన్ని గౌరవించాలని అన్నారు. నాయకులు చంద్రకళ, విజయలక్ష్మి, వేలు, సుధాకర్, ఎన్.ముకుంద, ప్రతాప్ పాల్గొన్నారు.



టీటీడీ క్రీడా పోటీల్లో సెమీ ఫైనల్‌కు చేరుకున్న మస్తాన్ జట్టు

ప్రజాశక్తి -తిరుపతి సిటి

టీటీడీ క్రీడా పోటీల్లో భాగంగా గురువారం జరిగిన క్రికెట్ పోటీలలో మస్తాన్ జట్టు గెలుపొంది సెమీఫైనల్కు చేరుకుంది. స్థానిక వెటర్నరీ యూనివర్సిటీ గ్రౌండ్లో జరిగిన మ్యాచ్లో జె టీ మీద ఈ టీం 191 రన్స్ తో గెలిచి సెమీ ఫైనల్ కి క్వాలిఫై అయ్యింది.మొదట బ్యాటింగ్ చేసిన ఈ టీం కెప్టెన్ మస్తాన్ వ్యక్తిగత స్కోరు 143 రన్స్ అవుట్ ఆఫ్ 66 బాల్స్ లో ఇప్పటివరకు జరిగినటువంటి టోర్నమెంట్లో హైయెస్ట్ వ్యక్తిగతమైన స్కోరు కైవసం చేసుకుంది. ఇప్పటివరకు జరిగిన క్రికెట్ టోర్నమెంట్ లో అత్యధిక పరుగులు సాధించినటువంటి ఈ టీం 191 పరుగులు నిర్ణీత 15 ఓవర్లో నమోదు అయ్యింది. మస్తాన్ కెప్టెన్ ఇన్నింగ్స్ 143 పరుగులు 66 బాలులో 18 ఫోర్లు, ఐదు సిక్స్ లు కొట్టి మేన్ అఫ్ ది ప్లేయర్గా నిలిచాడు.



కాంగ్రెస్ అభ్యర్థిగా ఆశీర్వదించండి : పైమూరు మురగయ్య

ప్రజాశక్తి - నాయుడుపేట

సూళ్లూరుపేట నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థిగా తనను ఆశీర్వదించి సేవ చేసుకునే అవకాశం కల్పించాలని పైమూరు మురగయ్య వేడుకున్నారు. శ్రీకాళహస్తి మాజీ ఎంఎల్‌ఎ తాడిపత్రి చెంచురెడ్డి అనుచరుడుగా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తగా బాధ్యతలు నిర్వహించానన్నారు. శ్రీకాళహస్తి మండలం ఊరందూరు గ్రామానికి చెందిన తాను ఇపుడు సూళ్లూరుపేట నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్నట్లు వెల్లడించారు. తన మామ దొరవారిసత్రం మండలం తల్లంపాడు గ్రామానికి చెందిన మేర్లపాక మునస్వామి అని, గతంలో రెండుసార్లు వరుసగా సూళ్లూరుపేట నియోజకవర్గం నుంచి ఎంఎల్‌ఏగా గెలుపొందారన్నారు. ఆంధ్ర రాష్ట్రంలో కనుమరుగై పోతున్న కాంగ్రెస్ పార్టీకి వైఎస్ షర్మిల రాకతో పూర్వ వైభవం సంతరించుకుందన్నారు.

వైఎస్‌ఆర్ ఇబిసి నేస్తం విడుదల : కలెక్టర్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

మహిళా సాధికారత కోసం పేద మహిళలకు అండగా చిన్న చిన్న వ్యాపారాలను అభివద్ధి చేసుకోవాలనుకునేవారు ఆర్థికంగా ఎదగాలని వైఎస్ఆర్ ఇబిసి నేస్తం మూడవ విడతగా జిల్లాలో 17,428 మందికి రూ.26.14 కోట్లు నేరుగా వారి బ్యాంకు ఖాతాలకు ముఖ్యమంత్రి జమ చేశారని కలెక్టర్ డా.లక్ష్మీ శ అన్నారు. గురువారం ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి నంద్యాల జిల్లా, బనగానపల్లె నుండి రాష్ట్ర వ్యాప్తంగా అర్హులైన 4,19,583 మంది లబ్దిదారుల ఖాతాలకు వై.ఎస్.ఆర్. ఇ.బి.సి. నేస్తం నగదు జమ చేసే కార్యక్రమాన్ని కంప్యూటర్ బటన్ నొక్కి ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్నటువంటి పేద మహిళలకు 45-60 ఏళ్ల మధ్య వయస్సు కలిగి ఆర్థికంగా వెనుకబడిన ఉన్నత వర్గాలకు చెందిన కమ్మ, రెడ్డి, బ్రాహ్మణ, క్షత్రియ, వెలమ, ఒసిలకు ప్రతి ఏటా 15వేల రూపాయలు నగదును వారి ఖాతాల్లో జమ చేస్తున్నామన్నారు. మెగా చెక్కును లబ్దిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో బిసి కార్పొరేషన్ ఎఇఒ బాబురెడ్డి, వెల్ఫేర్ అధికారి భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.



స్విమ్స్‌లో ఘనంగా ప్రపంచ కిడ్నీ దినోత్సవం

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

స్విమ్స్ లో నెఫ్రాలజి విభాగం ఆధ్వర్యంలో గురువారం ప్రపంచ కిడ్నీ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. స్థానిక శ్రీ పద్మావతి ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమానికి స్విమ్స్ సంచాలకులు డాక్టర్ ఆర్.వి.కుమార్ , డీన్ డాక్టర్ అల్లాడిమోహన్, నెఫ్రాలజీ విభాగాధిపతి, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ , సీనియర్ నెఫ్రాలజి ప్రొఫెసర్ డాక్టర్ శివకుమార్, డాక్టర్. నాగరాజు అతిథులుగా హాజరై జ్యోతి ప్రజ్వలనంతో కార్యక్రమం ప్రారంభించారు. నెఫ్రాలజి విభాగం సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ శివ కుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మానసిక ప్రశాంతతతో వుంటే ఆరోగ్యవంతమైన జీవనం సాధించవచ్చునని, ఆహారం తగిన మోతాదులో తీసుకోవాలని, ఎక్కువగా తీసుకోవడం వల్ల బి.పి, షుగర్ వ్యాధుల బారిన పడే అవకాశం ఉంటుందని తెలియజేశారు. స్విమ్స్ సంచాలకులు డాక్టర్. ఆర్. వి. కుమార్ మాట్లాడుతూ ఆహారపు నియమాలు తప్పనిసరిగా పాటించాలని తెలియజేశారు. సంవత్సరానికి ఒక్కసారి పరీక్షలు చేసుకోవడం వలన ముందుగా తెలుసుకొని కిడ్నీ సమస్యల బారిన పడకుండా జాగ్రత్త పడవచ్చునని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎస్ వి ఎస్ ప్రసాద్, జయప్రకాష్ పాల్గొన్నారు.



అసాధారణ మేధావి ఆల్బర్ట్ ఐన్‌స్టీన్

ప్రజాశక్తి - రేణిగుంట, క్యాంపస్

భౌతికశాస్త్రంలో అనేక విప్లవాత్మక మార్పులు తెచ్చిన అసాధారణ మేధావి ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ అని జనవిజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షులు ఒ.వెంకటరమణ అన్నారు. గురువారం ఐన్‌స్టీన్ జయంతిని విద్యార్థుల మధ్య ఘనంగా నిర్వహించారు. జెవివి కన్వీనర్ కుప్పస్వామి మాట్లాడుతూ భౌతిక శాస్త్రంలో అనేక విప్లవాత్మక మార్పులు తెచ్చారన్నారు. ఆర్‌సిఎం హైస్కూల్ విద్యార్థులతో ఈ వేడుక జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. సైన్స్ మానవ కల్యాణానికి తోడ్పడాలన్నారు.

జెవివి ఆధ్వర్యంలో కిరణ్ ఇంగ్లీష్ మీడియం హైస్కూలు విద్యార్థులో ఐన్‌స్టీన్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. పోలీసు ఇన్‌స్పెక్టర్ మురళీమోహన్, ఆర్ట్స్ కాలేజీ ప్రొఫెసర్ చంద్రశేఖర్ ముఖ్య అతిథిలుగా పాల్గొన్నారు. విద్యార్థులు మూఢనమ్మకాలను వదిలిపెట్టాలన్నారు. అమీర్, జయరాంరెడ్డి, రఫీ, రమణ, కుప్పస్వామి, శశికళ, బాలోత్సవం నాయకులు ఎం.నాగార్జున పాల్గొన్నారు.



ఎన్నికలకు పక్కాగా ఏర్పాట్లు..

- హింసాత్మక ప్రాంతాల్లో ప్రత్యేక బందోబస్తు
- రీ పోలింగ్ కేంద్రాల పరిశీలనలో కలెక్టర్ లక్ష్మీ శ

ప్రజాశక్తి-రామచంద్రాపురం: గత సాధారణ ఎన్నికలలో చంద్రగిరి నియోజకవర్గ పరిధిలోని రామచంద్రాపురం మండలంలో రీపోలింగ్ జరిగిన ఆరు పోలింగ్ కేంద్రాలను జిల్లా ఎన్నికల అధికారి, డాక్టర్ జి. లక్ష్మీ శ గురువారం పరిశీలించారు. మండలంలోని వెంకట్రామపురం, కమ్మపల్లి, కొత్త కండ్రిగ, కుప్పం బాదూరు, సి.కాలేపల్లి, నిలువు రాళ్ల కమ్మపల్లిలో పోలింగ్ కేంద్రాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన రీ పోల్‌కు కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈ దఫా సార్వత్రిక ఎన్నికలు 2024లో ఎట్టి పరిస్థితుల్లో రీ పోల్, హింసాత్మక సంఘటనలు చోటు చేసుకోకుండా ఎన్నికల నిర్వహణకు ఈఆర్ఓ, ఎఈఆర్ఓలు, సెక్టోరల్ అధికారులు, పోలీస్ అధికారులు అన్ని రకాల చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల ప్రక్రియకు విఘాతం కలిగించే వారిపై ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజాస్వామ్యంలో ఎన్నికలు ఒక గొప్ప ప్రక్రియ అని, ప్రజలు స్వేచ్ఛగా ఓటు వేసేలా, నిష్పాక్షికంగా ఎన్నికలు జరిగేలా ఎన్నికల విధులు నిర్వర్తించే అధికారులు పక్కా ప్రణాళికతో ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టి, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, తగినంత పోలీస్ బందోబస్తు ఏర్పాటుతో ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాల్సి ఉంటుందన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికలలో ఎలాంటి హింసాత్మక సంఘటనలు చోటు చేసుకోకుండా,రీ పోల్‌కు తావు లేకుండా కేంద్ర బలగాలు, రాష్ట్ర పోలీస్ బలగాలు, మైక్రో అబ్జర్వర్ల ఏర్పాటు, వెబ్ క్యాస్టింగ్, వీడియోగ్రఫీ తదితర ఏర్పాట్లతో, పర్యవేక్షణ చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో పిఎస్ సంఖ్య, నియోజకవర్గం, సంబంధిత పోలీస్ ఎస్‌హెచ్ఓ పేరు నంబర్, తహశీల్దార్ పేరు ఫోన్ నంబర్లను, పి.సి నంబర్‌ను ప్రస్ఫుటంగా కనిపించేలా ఏర్పాట్లు ఉండాలని సూచించారు. ఎఈఆర్ఓలు, సెక్టోరల్ అధికారులు వారి పరిధిలోని పోలింగ్ కేంద్రాలు, ఎన్నికల నిబంధనలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు ర్యాంపు, త్రాగు నీరు, మరుగుదొడ్లు పక్కాగా ఉండాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీవో నిశాంత్‌రెడ్డి, తహశీల్దార్ ఉషారాణి, సెక్టోరల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



పోలింగ్ కేంద్రాల పరిశీలనలో కలెక్టర్

తేనెటీగల పెంపకంతో అధిక లాభం: డాకర్ రమణ

ప్రజాశక్తి-క్యాంపస్: తేనెటీగల పెంపకం ద్వారా అధిక లాభం పొందవచ్చునని సహ వ్యవసాయ పరిశోధనా సంచాలకులు డాక్టర్ రమణ అన్నారు. ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం, నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మైక్రోస్మాల్ అండ్ మీడియం ఎంటర్ప్రైజెస్ సంయుక్తంగా నిర్వహించిన తేనెటీగల పెంపకంపై రెండు రోజుల రాష్ట్రస్థాయి సదస్సు గురువారం సెమినార్ హాల్లో నిర్వహించారు. డాక్టర్ రమణ సభను ఉద్దేశించి మాట్లాడుతూ తేనె యొక్క ఉపయోగాలు ఔషధ గుణాలు తేనెటీగల పెంపకం ద్వారా తయారయ్యే వివిధ ఉత్పత్తుల గురించి తెలిపారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎస్వీ వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఈ సదస్సు ద్వారా తేనెటీగల పెంపకంలోని మెలకువలను తెలుసుకుని తేనె ఉత్పత్తిదారుల సంఘాన్ని ఏర్పాటు చేసుకుని అధిక లాభాలను పొందాలని కోరారు. డాక్టర్ నాగరాజు మాట్లాడుతూ నాణ్యమైన, స్వచ్ఛమైన తేనెను తయారుచేసి ప్రభుత్వం ద్వారా ధ్రువీకరణ పొందడం వలన అధిక రాబడి పొందవచ్చని



తెలిపారు. డిప్యూటీ డైరెక్టర్ హార్టికల్చర్ దశరథరామిరెడ్డి మాట్లాడుతూ తేనె ఉత్పత్తిలో కృషి చేయడమే కాక రైతాంగం రైతు ఉత్పత్తి కేంద్రం ఏర్పాటు చేసుకొని సన్న కారు వ్యాపారస్తులతో సంధి కుదుర్చుకొనటం ద్వారా తమ ఉత్పత్తిని అధిక ధరలకు విక్రయించుకోవచ్చని తెలిపారు. డాక్టర్ సుధాకర్ మాట్లాడుతూ కేవలం తేనె తయారీ కాకుండా ఉప్పొడి తేనెటీగల నుంచి వచ్చే మైనపు యొక్క ఉత్పత్తులు, ఇతర విలువ ఆధారిత ఉత్పత్తులపై ప్రత్యేక దృష్టి సారిస్తూ రైతుల సహాయ కేంద్రాలు ఏర్పాటు చేయాలని, ఈ సదస్సు ద్వారా తేనెటీగల పెంపకంలోని సాధక బాధకాలు, లాభనష్టాలను గురించి అవగాహన తెచ్చుకుని ఆ తర్వాత తేనెటీగల పెంపకాన్ని ప్రారంభించాలని కోరారు.

నిష్పక్షపాతంగా విధులు నిర్వర్తించాలి: ఎస్పీ



ప్రజాశక్తి-తిరుపతి డెస్క్: విధుల్లో నిశ్పక్షపాతంగా ఉంటూ బాధితులకు భరోసాగా నిలవాలని పోలీసులను ఎస్పీ కృష్ణకాంత్ ఆదేశించారు. గురువారం ఆయన పాకాల పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని పలు రికార్డులు పరిశీలించారు. అక్కడి శాంతిభద్రత అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల వేళ అప్రమత్తంగా ఉంటూ చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై నిఘా పటిష్టం చేయాలని అక్కడి అధికారులకు పలు సూచనలు చేశారు. ఇప్పటి వరకూ పలు కేసుల్లో నిందితులుగా ఉన్న వారిని బైండోవర్ చేసుకోవాలని ఆదేశించారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో అనుసరించాల్సి భద్రతా పరమైన అంశాలను చర్చించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ చోటు చేసుకోకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ శరత్‌కుమార్ రాజ్, పాకాల సీఐ రాజగోపాల్, ఎస్ఐ మహేష్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

'విశ్వం' విద్యార్థుల ప్రభంజనం



ప్రజాశక్తి-క్యాంపస్: 2024 విద్యా సంవత్సరానికి జాతీయ స్థాయిలో జనవరి 28న జరిగిన ఆల్ ఇండియా సైనిక్ స్కూల్ ఎంట్రన్స్ టెస్ట్ ప్రవేశ పరీక్ష మెరిట్ లిస్ట్ ఫలితాలలో తిరుపతి విశ్వం విద్యార్థులు సంచలన ఫలితాలు నమోదు చేశారు. విద్యా సంస్థల అధినేత, కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షులు డా.యన్.విశ్వనాథ రెడ్డి మాట్లాడుతూ 237 మంది విశ్వం విద్యా సంస్థల విద్యార్థులు సైనిక్ స్కూల్ ఫలితాల్లో అర్హత సాధించినట్లు చెప్పారు. కాగా అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థుల వివరాలను ఆయన వివరించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ తులసి విశ్వనాథరెడ్డి, అకడమిక్ డైరెక్టర్ విశ్వచందన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎఫెక్టివ్ కమ్యూనికేషన్ వ్యూహాలపై ఉపన్యాసం

ప్రజాశక్తి-క్యాంపస్: వియత్నాంలోని స్విన్‌బర్న్ యూనివర్శిటీ ఆఫ్ టెక్నాలజీకి చెందిన ఫ్యాకల్టీ డాక్టర్ లే థు మాక్ ఎస్ పిఎంవివిలో "క్రైసిస్ మేనేజ్‌మెంట్‌లో ఎఫెక్టివ్ కమ్యూనికేషన్ కోసం వ్యూహాలు" అనే అంశంపై వర్చువల్ సెషన్‌ను అందించారు. సంక్షోభాన్ని తగ్గించడానికి, విశ్వసనీయతను రక్షించడానికి, ఖ్యాతిని తిరిగి పొందడానికి కంపెనీలు, సంస్థలలో సంక్షోభ పరిస్థితులను నిర్వహించడం ఎంత ముఖ్యమో ఆమె వివరించారు. సెంటర్ ఫర్ ఇంటర్నేషనల్ రిలేషన్స్ డీన్ పి.విజయలక్ష్మి సమన్వయం చేశారు. కార్యక్రమంలో ఎంబిఎ విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహిస్తాం..

ప్రజాశక్తి-కోట: రానున్న సార్వత్రిక ఎన్నికలను ప్రశా ంతంగా నిర్వహించేందుకు అన్ని విధాల చర్యలు చేప డతామని సీఐ హరికృష్ణ తెలిపారు. గురువారం మం డలంలో కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూర్తి స్థాయి బందోబస్తు నిర్వహించి శాంతియుత వాతావరణాన్ని నెలకొల్పుతామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎస్ఐ నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

గీతాంజలిది బలవన్మరణం: మోహిత్‌రెడ్డి

ప్రజాశక్తి-రామచంద్రాపురం: నా కల వైఎస్ఆర్సీపీ ప్రభుత్వ పాలనలో నెరవేరిందని తెనాలికి చెందిన గీతాంజలి సంతోషంగా చెప్పడమే ఆమె పాలిట శాపంగా మారిందని తుడా ఛైర్మెన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి పేర్కొన్నారు. గీతాంజలి బలవన్మరణంతోనైనా సోషల్ మీడియా వేదికగా వేధింపులకు పాల్పడే వారికి కనువిప్పు కావాలన్నారు. మంచిని ప్రచారం చేసుకునేందుకు వినియోగించాల్సిన సోషల్ మీడియాను అభం శుభం తెలియని అమాయకురాలు ప్రాణాలను తీసుకునే విధంగా ట్రోల్స్ చేయడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. గురువారం విశ్వబ్రాహ్మణుల సంఘం ఆధ్వర్యంలో చంద్రగిరి టవర్ క్లాక్ వద్ద గీతాంజలి మృతి పట్ల ఆమె చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి సంఘీభావం తెలుపిన చెవిరెడ్డి మోహిత్ రెడ్డి ఆమె చిత్ర పటానికి శ్రద్ధాంజలి ఘటించారు. ఆమె పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. పెద్ద సంఖ్యలో మహిళలు హాజరై, గీతాంజలి మృతికి కారకులైన రాక్షసులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

'గురవారెడ్డి ఆచూకీ తెలపండి'

ప్రజాశక్తి-రామచంద్రపురం: మండలంలోని నడవలూరు గ్రామానికి చెందిన గురువారెడ్డి ఆచూకీ తెలపాలని వారి కుటుంబ సభ్యులు గురువారం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. వారు తెలిపిన వివరాల మేరకు ఈనెల 9న పొలం వద్దకు వెళ్ళాడు ఎంతకీ తిరిగి రాలేదు. దీంతో వారు బంధువుల వద్దకు వెళ్లి వెతికిన ఆయన జాడ తెలియకపోవడంతో గురువారెడ్డి ఆచూకీ తెలపాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు. గురవారెడ్డి ఇంటి నుంచి వెళ్లే రోజున లేత పసుపు రంగు షర్టు, పచ్చ రంగు టవల్, ఖాకీ రంగు పంచ ధరించి ఉన్నట్లు చెప్పారు. ఇతని ఆచూకీ తెలిసినవారు రామచంద్రాపురం పోలీస్ స్టేషన్ ఎస్ఐ చిరంజీవి 9440796731 నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.



గురవారెడ్డి(ఫైల్‌ఫొటో)

వైసిపి పంచిన చీరలు బీసీవై పార్టీవే..

ప్రెస్‌మీట్‌లో నేతల ధ్వజం

ప్రజాశక్తి- పుంగనూరు: నియోజకవర్గంలో వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ పంచుతున్న చీరలు బీసీవై పార్టీవేనని, ఇంత నీచరాజకీయాలకు దిగజారుడు మంచిది కాదని ఆ పార్టీ నేతలు మాజీ ఏఎంసీ ఛైర్మన్ హరినాథ్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ చెనకంటి సాంబ మూర్తులు ధ్వజమెత్తారు. ఎల్ఐసి కాలనీ సునంద నిలయంలో వారు విలేకరులతో మాట్లాడుతూ 2019 ఎన్నికల తర్వాత బిసివై పార్టీ సంక్రాంతి కానుకగా పుంగనూరు నియోజకవర్గంలోని అక్కచెల్లెమ్మలకు పండుగ సంతోషంగా జరుపుకోవాలని ఇచ్చేందుకు 73వేలు చీరలు తెప్పించగా వాటిని పోలీసులు నకిలీ మద్యంపెట్టి, అక్రమంగా కేసు బనయించారని చెప్పారు. అప్పుడు సీజ్ చేసిన చీరలన్నీ పోలీసులు అధీనంలో ఉన్నాయనుకున్నామని కానీ ఇప్పుడు వైసిపి నాయకులు వాలంటీర్ల ద్వారా పంపిణీ చేయడం సిగ్గుచేటు అన్నారు. మేము కొనుగోలు చేసిన చీరలన్నింటికీ బిల్లులు, ట్రాన్స్‌పోర్ట్ బిల్లులు, చీరలు కొన్నందుకు పన్ను చెల్లించిన బిల్లులన్నీ తమ వద్ద ఉన్నాయని ఈ సందర్భంగా చూపించారు. తాము కొన్న చీరలు వైసీపీ ఎలా పంపిణీ చేస్తుందని, పోలీసు వ్యవస్థ ఏంచేస్తుందని ప్రశ్నించారు. వారు చేస్తే రాజకీయం మేము చేస్తే ఇంకొకటి అంటూ మండిపడ్డారు.



అభివృద్ధి పనులు ప్రారంభం

ప్రజాశక్తి - వెదురుకుప్పం /ఎస్ఆర్ పురం: మండలంలోని పలు అభివృద్ధి పనులను రాష్ట్ర డిప్యూటీ సీఎం నారాయణస్వామి, సర్పంచ్ డివి డిల్లెయ్య, మాజీ సర్పంచ్ విజయబాబు, ఎంపీటీసీ సుజాత ఆధ్వర్యంలో ప్రారంభించారు. గురువారం కొత్తపల్లి గ్రామ పంచాయతీలలో వాటర్ ట్యాంక్, వైయస్సార్ హెల్త్‌విలేజ్ క్లినిక్, సిసి రోడ్లు, మిల్క్ సెంటర్‌ను ప్రారంభించారు. జడ్పిటిసి రమణ ప్రసాద్ రెడ్డి, ఎంపీపీ సరిత, డిసిసిబి బ్యాంక్ డైరెక్టర్ బాలసుబ్రమణ్యం రెడ్డి, వైస్ సర్పంచ్ సుందరం, పి.దామోదరం, గోవిందరెడ్డి, దేవరాజు రెడ్డి, మార్కొండయ్య, కుప్పయ్య, మణి, జనార్ధన్, భూపతిరెడ్డి పాల్గొన్నారు.



సచివాలయం ప్రారంభం

ప్రజాశక్తి- చిత్తూరు డెస్క్: నియోజవర్గంలో జరిగే అభివృద్ధిని చూడండి.. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని ఆదరించండి అని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసుల, క్రీడాశాఖ మంత్రి ఆర్కేరోజా అన్నారు. గురువారం మండలంలోని అడవికొత్తూరు గ్రామంలో రూ.40 లక్షల వ్యయంతో నిర్మించిన సచివాలయ భవనాన్ని, తుడా నిధులు రూ.20లక్షలతో నిర్మించిన కాలువను ప్రారంభించారు. రూ.20 లక్షలతో నిర్మించే సిమెంటు రోడ్డుకు ఆమె భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రస్తుత పాలనలో ఎన్ని అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ఎంత మందికి సంక్షేమం అందుతో ప్రజలు ప్రత్యక్షంగా చూస్తున్నారన్నారు. ఒక్క అడవికొత్తూరు సచివాలయ పరిధిలోనే డీబీటీ, నాన్ డీబీటీ కింద రూ. 14.76 కోట్లు అభివృద్ధి పనులు జరిగిందన్నారు. జరిగిన ప్రతి అభివృద్ధి గణాంకాలతో సహా చూపడం జరిగిందన్నారు. విద్య, వైద్యం, గూడు అన్నీ ప్రజలకు ఎలాంటి అవాంతరాలు లేకుండా అందుతోందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ భార్గవి, వైస్ ఎంపీపీలు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

ప్రజాశక్తి -తిరుపతి టౌన్ శ్రీ పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ మున్సిపల్ హై స్కూల్ నందు 2005 – 2006 వ సంవత్సరం పదో తరగతి చదివిన విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం వేడుకగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు మునిశేఖర్ హాజరయ్యారు. పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ ఆనాటి తమ గురువులైన ఆనంద్ కుమార్, ముని శారద, రెడ్డప్ప రెడ్డి, శాంతి కళ ,చంద్రశేఖర్, గీత ,రాజేందర్ రెడ్డి లను ఈ కార్యక్రమానికి ఆహ్వానించి సత్కరించడం ఆనందంగా ఉందన్నారు. .తమ వంతు బాధ్యతగా 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు అవసరమైన విద్యా ఉపకారణములు అందజేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు రమేష్ నాయక్, ఉమాపతి ,రఘుపతి, రామ్ రాజ్, భావజాన్ , రాజశేఖర్, భార్గవ్ పాల్గొన్నారు.

శరవేగంగా రహదారి పనులు

ప్రజాశక్తి-గూడూరుటౌన్: చిల్లకూరు సాగరమల రహదారి పనులు శరవేగంగా సాగుతున్నాయి. 4 నుండి 6లైన్ల రోడ్డు సుమారు రూ.686.6కోట్లు అంచనాతో పనులు సాగుతుండగా వచ్చే ఏడాది చివరికల్లా పూర్తి చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. సాగరమల ప్రాజెక్టు 36కిలోమీటర్ల పరిధిలో 12గ్రామాల మీదుగా ఈ రహదారి ఏర్పాటౌతోంది. అతితక్కువ సమయంలో కృష్ణపట్నం పోర్టుకు చేరుకొనేలా రోడ్డు అందుబాటులోకి రానుంది.

'దేశ ప్రగతిలో భాగస్వాములు కండి'

ప్రజాశక్తి-బుచ్చినాయుడుకండ్రిగ: విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో రాణించి దేశ ప్రగతిలో భాగస్వాములు కావాలని బీసీ సంక్షేమ శాఖ బాలుర వసతి గృహ అధికారి రామయ్య పేర్కొన్నారు. గురువారం వసతి గృహంలో సరస్వతి పూజ ఘనంగా నిర్వహించారు. పదో తరగతి విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు పలికారు. పరీక్షలు బాగా రాసి ఉత్తమ ఫలితాలు సాధించాలని విద్యార్థులకు ఆయన సూచించారు. అనంతరం విద్యార్థులకు పరీక్ష సామగ్రిని అందజేశారు. కార్యక్రమంలో ట్యూటర్స్ రమణ కుమార్, సుబ్బరామయ్య, దయాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా జనసేన ఆవిర్భావ వేడుకలు

ప్రజాశక్తి-గూడూరుటౌన్: పట్టణంలోని జనసేన పార్టీ కార్యక్రమంలో 11వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉమ్మడి నెల్లూరు జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్ పార్టీ జెండా ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ పవన్‌కళ్యాణ్ భుజస్కందాలపై 10సంవత్సరాల పాటు పార్టీని బలోపేతం చేస్తూ రాష్ట్రంలో నిజమైన ప్రతిపక్ష పార్టీగా రూపాంతరం చెందిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

పరీక్ష సామగ్రి పంపిణీ



పరీక్షా సామగ్రిని పంపిణీ చేస్తున్న దాతలు

ప్రజాశక్తి-పుత్తూరుటౌన్: పట్టణంలోని స్థానిక పిళ్లారిపట్టు ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు దాతల ద్వారా పరీక్షా సామగ్రిని పంపిణీ చేశారు. "జీవనజ్యోతి సోషల్ వెల్ఫేర్ సొసైటీ" ఆధ్వర్యంలో గురువారం పాఠశాలలోని విద్యార్థులకు మెటీరియల్, రైటింగ్ ప్యాడ్, జామెంట్రీ బాక్స్, పెన్, పెన్సిల్ తదితర సామగ్రిని అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం మునిలక్ష్మీ, సంస్థ వైస్ ప్రెసిడెంట్ వడివేలు తదితరులు పాల్గొన్నారు.

రేణిగుంట: మండలంలోని విప్పమాను పట్టెడలో 10వ తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రిని దాతలు అందజేశారు. గురువారం పరిపాలన భవనం వద్ద వేమాపురం సంజీవరెడ్డి మెమోరియల్ వెల్ఫేర్ సొసైటీ ద్వారా లక్ష్మీపతి అందజేశారు.

ఇంటి పట్టాలు పంపిణీ

ప్రజాశక్తి-గూడూరుటౌన్: లబ్ధిదారులకు నూతనంగా మంజూరైన ఇంటి పట్టాలను గురువారం పంపిణీ చేశారు. పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న స్వచ్ఛ ఆంధ్ర సంస్థ ఛైర్మన్ దేవసానమ్మ, వైసీపీ సీఈసీ సభ్యులు గోపాల్‌రెడ్డి, ఆర్‌డీవో కిరణ్‌కుమార్ చేతుల మీదుగా పట్టాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ కరుణకుమార్, కమిషనర్ వెంకటేశ్వర్లు, నాయకులు విజయమోహన్‌రెడ్డి, విజయ కుమార్‌రెడ్డి, బాబురెడ్డి, మహేంద్రరెడ్డి పాల్గొన్నారు.



చలివేంద్రం ప్రారంభిస్తున్న నాయకులు

చలివేంద్రం ఏర్పాటు


ప్రజాశక్తి-పుత్తూరుటౌన్: పట్టణంలోని కార్వేటినగరం రోడ్డులో టీఎన్‌టీయూసీ నాయకులు చలివేంద్రం ఏర్పాటు చేశారు. గురువారం చలివేంద్రాన్ని టీడీపీ నగరి ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భాను చేతుల మీదుగా ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు మాధవ నాయుడు, జీవరత్నంనాయుడు, ధనపాల్, షణ్ముగంరెడ్డి, విక్కీ రాయల్, సుధారాయల్, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ సంరక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి-క్యాంపస్: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ నీరజ అన్నారు. గురువారం కుంట్రపాకంలో ప్రత్యేక సేవ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. పర్యావరణ పరిరక్షణ, లింగాసమానత్వ సాధన అంశాలపై గ్రామస్థులకు అవగాహన ర్యాలీ చేపట్టారు. గ్రామ ప్రజలకు పండ్ల మొక్కలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వాలంటీర్లు, సర్పంచ్ శుభా పద్మనాభంరెడ్డి, కార్యదర్శి మురళి, హెచ్‌ఎం సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి తీరిన నీటి అవసరం

ప్రజాశక్తి-పిచ్చాటూరు: మండలంలోని టీచర్స్ కాలనీలో ఉన్న చెంచమ్మ ఆలయంలో నీటి అవసరం ఎట్టకేలకు తీరింది. ఎంపీపీ నిధులతో ప్రత్యేకంగా బోరు, మోటారు ఏర్పాటు చేశారు. కాగా గురువారం ఎంపీపీ భర్త హరిచంద్రారెడ్డి, సర్పంచ్ కేజీ రోస్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. దీంతో ఆలయంలో నీటి సౌకర్యం ఏర్పాటైంది. కార్యక్రమంలో పద్మనాభం, గోవింద్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.



విజయసాయిరెడ్డిని కలిసిన నేతలు

ప్రజాశక్తి-కోట: వైసీపీ ప్రధాన కార్యదర్శి విజయసాయిరెడ్డిని పలువురు వైసీపీ నాయకులు కలిశారు. నెల్లూరు పర్యటనలో ఉన్న బీద మస్తాన్‌రావు, ఆదాల ప్రభాకర్‌రెడ్డి, విజయసాయిరెడ్డిని గురువారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందజేశారు. కలిసిన వారిలో ముదిరాజ్ కార్పొరేషన్ ఛైర్మన్ కొర్నా వెంకట నారాయణ రావు, కేశవరం పంచాయతీ నాయకులు శ్రీరామ్ గురుస్వామి, ప్రసాద్, రఘురామయ్య, చిరంజీవి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సాయి ప్రసాద్‌రెడ్డికి మంత్రి పలకరింపు

మాజీ సీఎం నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి విగ్రహ ఆవిష్కరణకు వాకాడు విచ్చేసిన మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చిల్లకూరు సాయి ప్రసాద్‌రెడ్డిని పలకరించారు. నలప్పరెడ్డి వినోద్‌కుమార్‌రెడ్డి నివాసంలో పెద్దిరెడ్డిని సాయిప్రసాద్‌రెడ్డి ఘనంగా సన్మానించారు.

జాతీయ సైన్స్ సదస్సుకు విద్యార్థి ఎంపిక



వాణిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి-రామచంద్రాపురం: జాతీయ సైన్స్ సదస్సుకు రామచంద్రాపురం విదార్థి ఎంపికయ్యారు. మండలంలోని కమ్మపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న 9వ తరగతి చదువుతున్న వాణి ఎంపికైనట్లు ఇన్‌ఛార్జ్ హెచ్‌ఎం మోహన్ తెలిపారు. గురువారం కమ్మపల్లి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థిని వాణి, గైడ్ టీచర్ కామేశ్వరిలకు అభినందన సభను ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 11 నుండి 13వ తేదీ వరకు పలమనేరులోని మదర్ తెరిసా ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో కొబ్బరి బొండాలను కత్తితో కాకుండా కోకోనట్ డ్రిల్లర్ అండ్ బ్రేకర్ సహాయంతో సులభంగా రంధ్రాలు చేయు పరికరం యొక్క నమూనాను తయారుచేసి ప్రదర్శించారన్నారు. ఈ నమూనా న్యాయ నిర్ణేతల మన్ననలు పొంది జాతీయస్థాయి సైన్స్ సదస్సుకు ఎంపికైనట్లు వివరించారు. ఢిల్లీలో జరగనున్న జాతీయ స్థాయి సైన్స్ సదస్సులో పాల్గొన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జయమ్మ, శోభారాణి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి చేశాం..: ఎమ్మెల్యే



అభివృద్ధి పనుల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

ప్రజాశక్తి-రేణిగుంట: అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి చేశామని, వచ్చే ఎన్నికల్లో మరో అవకాశం ఇవ్వాలని ఎమ్మెల్యే బియ్యపు మధుసుదన్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యంతో కలిసి ప్రారంభోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ హరిప్రసాద్ రెడ్డి, జెడ్పిటిసి సంధ్యారాణి, వైస్ ఎంపీపీ సుజాతమ్మ, నాయకులు రమేష్, ప్రభాకర్, అస్సాం సాహెబ్, నగేష్, ఇర్ఫాన్, మొహమ్మద్, ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

చేయూత చెక్కు పంపిణీ

ప్రజాశక్తి-వెంకటగిరిరూరల్(డక్కిలి): డక్కిలి మండల వైఎస్సార్ మహిళా సమైక్య ఆధ్వర్యంలో ఎంపీపీ గోను రాజశేఖర్ అధ్యక్షతన చేయూత చెక్కు పంపిణీ కార్యక్రమం చేపట్టారు. గురువారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమం ద్వారా ఈ చెక్కును లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీనివాసులు, ఇన్‌ఛార్జ్ ఏపిఎం ఆదినారాయణ, సీసీలు పాల్గొన్నారు.

కుట్టు మిషన్లు వితరణ



ప్రజాశక్తి-పుత్తూరుటౌన్: రోజా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మహిళలకు మంత్రి రోజా కుట్టు మిషన్లు వితరణ చేశారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. కళాశాల ప్రిన్సిపాల్ అధ్యక్షతన జరిగిన సమావేశం లో మంత్రి 20 కుట్టు మిషన్లు అందజేయడంతో పాటు టైలరింగ్ శిక్షణా కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ హరి, వైస్ ఛైర్మన్లు జయప్రకాష్, శంకర్, కౌన్సిలర్లు, ఎంపీపీ మునివేలమ్మ, మహిళ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కొవ్వొత్తులతో నిరసన



నిరసన తెలియజేస్తున్న మహిళలు

ప్రజాశక్తి-బాలాయపల్లి: గీతాంజలి మరణానికి కారకులైన వారిని వెంటనే కఠినంగా శిక్షించాలని జిల్లా వైసీపీ మహిళా ప్రధాన కార్యదర్శి రామ తులసిరెడ్డి పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలో గీతాంజలి మరణానికి కారణమైన వారిని శిక్షించాలని కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. ఆమె మాట్లాడుతూ మహిళలను అసభ్య పదజాలంతో వేధిస్తున్న టిడిపి జనసేనకు చెందిన మానవ మృగాలపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మహిళలను కించ పరచడం చూస్తుంటే మనసు చలించి పోతుందని ఆరోపించారు. ప్రభుత్వం ఎన్ని శిక్షలు అమలు చేస్తున్నప్పటికీ వీరిలో మార్పు రావడంలేదని మండిపడ్డారు. సోషల్ మీడియాలో వేధింపులకు గీతాంజలి ఆత్మహత్య చేసుకుని మృతి చెందిందన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలన్నారు.